తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - పాయకరావుపేట: తాగునీటి పైపు లైనుకు అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. వృథాగా పోతున్న తాగునీరు అనే వార్త విశాలాంధ్రలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ మనోజ్ కళ్యాణ్ పాయకరావుపేట మండలం, నక్కపల్లి మండ లాలకు తాగునీరు అందించే పైపులైనును పరిశీలించారు. రెండు చోట్ల పైపు మరమ్మత్తులకు గురైనట్లు గుర్తించి, తాగునీరు వృధాగా పోతున్నట్లు గమనించారు. పైపులు లీకులు కారణంగా నీరు వృధాగా పోతుందని, లీకైన పైపులకు మరమ్మత్తు పనులు చేపట్టారు. అంతేగాక తరుచూ మరమ్మత్తులకు గురవుతున్న పైపులను పూర్తి స్థాయిలో తొలగించి, కొత్త పైపులు వేసేందుకు చర్యలు తీసుకుంటామని జెఈ మనోజ్ కళ్యాణ్ తెలిపారు.

చెట్లను తొలగించండి మహాప్రభో...

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్లను తొలగించి తమ ప్రాణాలను కాపాడాలని యక్కల మంగరత్నం అధికారులను కోరుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అనేక సంవత్సరాల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం మహా వృక్షాలుగా తయారై పాఠశాల ప్రాంగణాన్ని ఆనుకొని ఉన్న ఇల్లుపై పడేందుకు సిద్ధంగా ఉందన్నారు. దీంతో సమీపంలో నివాసం ఉంటున్న ఇళ్లపై ఎప్పుడు కూలి ఎవరు ప్రాణాల పోతాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవించాల్సిన దయనీయ పరిస్థితి తమకు ఎదురవుతుందని వారు అంటున్నారు. ఈ చెట్లు తొలగించాలని మండల ఎంఈఓ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దృష్టికి తీసుకువెళ్లిన కనీస స్పందన కానరావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లు కూలి ప్రాణాల పోకముందే చెట్లను తొలగించే బాధ్యత అధికారులు తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేస్తామని ఆమె తెలియజేశారు.

11 మంది వాలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర - గొలుగొండ: అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం సిహెచ్ నాగపురం పంచాయతీ పరిధిలో ఉన్న 11 మంది వాలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. రాజీనామా చేసిన పత్రాలను సచివాలయంలో అధికారులకు అంద జేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ బిజెపి పార్టీ నేతల తీరుపై మనస్థాపానికి గురై ఈ రాజీనామా చేసినట్లు వాలంటీర్లు వెల్లడించారు. వాలంటీర్లుగా తాము విధులు నిర్వహిస్తుంటే వివిధ రాజకీయ పార్టీ నాయకులు తమపై నిందలు వేస్తున్నారని అన్నారు. పెన్షన్లు ఇవ్వకుండా మమ్మల్ని అడ్డుకోవడం కలచివేసిందని వారన్నారు. వాలంటీర్లను అనేక విధాలుగా అవమానించినా భరించామన్నారు. ముఖ్యంగా పేదలకు ఇచ్చే పెన్షన్లు ఇవ్వకుండా అడ్డుకోవడం తమను బాధించిందన్నారు. వాలంటీర్లు పండు, రమణబాబు, పల్లా కుమారి, పల్లా రాజేశ్వరి, లమ్మ సింగి చిన్న రాయుడు, జైతి సిమ్రాన్, బొడ్డు సౌజన్య, నీ సం శ్రావణి, అప్పన రమణి, గురుబిల్లి బుజ్జి, కూనిశెట్టి వెంకట దుర్గ, పద్మావతి జైతి శ్రీదేవిలు రాజీనామా చేశారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ ప్రక్రియ

కలెక్టరు రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: పోలింగ్ ప్రక్రియలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సజావుగా జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి ఆర్వోలను ఆదేశించారు. గురువారం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులతోపాటు వికలాంగులను అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిం చాలన్నారు. పోస్టల్ బ్యాలట్లకు సంబంధించి ఎన్నికలలో పాల్గొనే సిబ్బందికి శిక్షణా కేంద్రాలవద్దే పోలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రానికి రాలేని 85 సం.లు నిండిన సీనియర్ ఓటర్లు, దివ్యాంగ ఓటర్లకు ముందుగా 12డి ఫారం ఇచ్చి దరఖాస్తు చేయించాలన్నారు. ఒకసారి దరఖాస్తు చేసిన తరువాత వారు ఇంటివద్దనే తప్పక ఓటు వేయవలసి వుంటుందన్నారు. సర్వీసు ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలట్ తప్పక ఇవ్వాలన్నారు.

పోలింగ్ కేంద్రాలకు వచ్చే వృద్ధులు, వికలాంగులకు వాహన సౌకర్యం కల్పించాలన్నారు. హెూమ్ ఓటింగ్‌లో రహస్యవోటింగ్ కు తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, డిస్ట్రిబ్యూటింగ్, కలెక్షన్, సిబ్బందికి చెల్లింపుల వద్ద నిపుణులైన సిబ్బందిని నియమించాలన్నారు. ఏ విషయంలో ఎటువంటి తప్పుదొర్ల కుండా క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు చిన్ని కృష్ణ, జయరామ్, డిఎం అండ్ హెచ్వో డాక్టర్ హేమంత్, ఆర్వోలు మనోరమ, గీతాంజలి, సత్యవాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

జగన్‌కు రాజకీయ సమాధి కట్టాలి

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర - పాయకరావుపేట: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి రాజకీయ సమాధి కట్టేందుకు అందరూ కలిసి పనిచేయాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. పాయకరావుపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పరిపాలనలో రాష్ట్రం సర్వ నాశనం అయిందన్నారు. వైసీపీకి వ్యతిరేకంగా మాట్లాడితే కేసులు పెట్టారని, తనపై 16 కేసులు పెట్టి ఏం పీకారని అన్నారు. దొంగ, నీచుడు అయిన జగన్‌కు ఎవరూ భయపడకూడదన్నారు. ఇసుక, గ్రావెల్ అమ్ముకున్నాడని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడన్నారు. చేసిన అప్పులకు వేల కోట్లు వడ్డీలు కడుతున్నారని తెలిపారు. ఉపాధి కూలీలకు డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్రం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు ట్రాన్స్ఫర్ జరగాలన్నారు. ఒక ఓటు సైకిల్ గుర్తుపై, మరొక ఓటు కమలం గుర్తుపై ఓటు వేసే విధంగా ప్రచారం చేయాలన్నారు. ఎంపిగా సీఎం రమేష్‌ను గెలిపిస్తే కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే మూడు పార్టీల కలయిక జరిగిందని అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పరిపాలనకు విముక్తి కలిగించాలన్నారు. వైసీపీని వీడి టిడిపిలోకి వలసలు వస్తుంటే ఆపార్టీలో వణుకు మొదలైందని అన్నారు. టిడిపిలో చేరేవారిని ప్రలోభాలకు గురి చేస్తున్నారని తెలిపారు. వైసీపికి డబ్బు ఉంటే, టిడిపిలో అభిమానం ఉందని, పాయకరావుపేటలో యుద్ధం స్టార్ట్ అయ్యిందని అనిత అన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొణతాల ప్రచార రథం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లిలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ ప్రచారం ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో నూతన ప్రచార రథాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా తయారు చేసిన ప్రచార రథాన్ని అనకాపల్లి ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి సన్నిధిలో గురువారం ఉదయం కొణతాల రామకృష్ణ అమ్మవారి దర్శనం చేసుకుని ఆలయ పండితుల మంత్రోచ్చారణలతో ప్రారంభించారు. మొదటిగా ఆర్య వైశ్యులతో ప్రారంభించుకోవటం శుభపరిణామంగా భావించి ఇమ్మడి శెట్టి నాగుబాబు పద్మజ దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వ హించి జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించారు. అనం తరం కొణతాల రామకృష్ణతో జనసేన నాయకులు శ్రీరామ దాసు గోవింద, తాడి రామకృష్ణ, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, బొడ్డేడ జోగి నాయుడు, కొణతాల సంతోష అప్పారావు నాయుడు ప్రచార రథం పైకి ఎక్కి అభివాదం చేస్తూ పట్టణ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యన్న పాఠశాలల మాక్ పోలింగ్

విశాలాంధ్ర - కె.కోటపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా విద్యా శాఖ అధికారి సూచనల ను అనుసరించి మండల విద్యా శాఖ అధికారులు గురువారం స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 'మాక్ పోలింగ్ అభ్యాసాన్ని' నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు కూనిరెడ్డి సత్యనారా యణ-1, డి.వి.డి.ప్రసాద్-2 ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగే విధానాన్ని ప్రదర్శించారు. ఓటర్లు, ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీసులు, అభ్యర్థుల ఏజెంట్స్‌గా విద్యార్థులు పాల్గొని పోలింగ్ రోజున ఈవీఎం (ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్) ద్వారా ఓటు వేసే విధానంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టరు ఖాశీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో టీడీపీ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - పాయకరావుపేట: రానున్న ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ టిడిపి పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో పట్టణంలోని దుర్గానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మల్లపురెడ్డి రమాకుమారి, చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరి, సూరా సుబ్రమణ్యం, లెక్కల గోవింద్, జూరెడ్డి ప్రసాద్, పెదిరెడ్డి నాగ వెంకట రమణ, గుల్లా నాగరాజు, చిరుకూరి పేర్రాజు, రాజాన ఆది, ఆచంట దొర, శివలంక నాగమల్లి, బిఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ మండల సచివాలయ కన్వీనర్

విశాలంధ్ర - అచ్యుతాపురం: వైసీపీ మండల సచివాలయాల కన్వీనర్ రాజాన విజయ్ కుమార్ వైసీపీని వీడి గురువారం టీడీపీలో చేరారు. మండలంలో సెజ్ కాలనీ (దిబ్బపాలెం గ్రామం) నుండి ఎలమంచిలి నియోజ కవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ మంత్రి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు సమక్షంలో రాజాన విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ రాజాన భాను ప్రకాష్, గ్రామ శాఖ అధ్యక్షుడు అడిగర్ల దేవుడుతోపాటు సుమారు 100 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు జనపరెడ్డి నరసింగరావు తదితరులు ఉన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మికతకు చిహ్నం

విశాలాంధ్ర - చోడవరం: దేవాలయాలు ఆధ్యాత్మికతకు, ప్రజల ఐక్యతకు చిహ్నాలుగా నిలుస్తాయని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, చోడవరం వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని దుడ్డుపాలెం గ్రామంలో గురువారం నూతనంగా నిర్మించిన శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించుకుని రానున్న ఎన్నికల్లో పోలవరం లోను రాష్ట్రంలోనూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని కోరుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించి అభినందించారు. రానున్న ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తారు అంటూ ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలి బాబు, స్థానిక నాయకులు, పారిశ్రామికవేత్త జి.సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ వై.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో రెవెన్యూ ఇంటెలిజెన్స్ దాడులు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండలం గాంధీ గ్రామంలో గల బుచ్చిబాబు ట్రేడర్స్‌పై రాష్ట్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు గురువారం ఏక కాలంలో దాడులు చేయడంపై తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అధికార ప్రభుత్వ పెద్దలు కక్ష పూరితంగా ఈ దాడులకు పాల్పడ్డారు అంటూ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్, చోడవరం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఎస్.ఎన్.రాజు ఆధ్వర్యంలో అధికారుల్ని నిలదీసారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా, అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ఎమ్మెల్యేలకు అడుగులకు మడుగులు ఒత్తుతూ ప్రతిపక్ష వ్యక్తుల వ్యాపారాల మీద దాడులు చేయడం సరి అయిన పద్ధతి కాదు అని చెప్పి వారు హెచ్చరించారు. అధికారులు దౌర్జన్యంగా తాళాలు తలుపులు పగలగొట్టి సీసీ కెమెరాలు ఆఫ్ చేసి దౌర్జన్యం చేయడం మంచిది కాదు అన్నారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఇసుక దోపిడీ, మైనింగ్ దోపిడీ మీద, లిక్కర్ దోపిడీ మీద దాడులు చేసి రాష్ట్రాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అధికారులను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు ముఖ్యంగా చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేస్తున్న అరాచకాలను చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని వారు తెలియజేశారు.

ఈ ఎన్నికల్లో ఫ్యాన్‌దే ప్రభంజనం

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి, మలసాల

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: వైసీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమమే తమను గెలిపిస్తుందని, ఎన్నికల్లో కూడా ఫ్యాన్‌దే ప్రభంజనమని వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ దీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో గల విజయ రామరాజుపేట ప్రాంతంలో వైసిపి అభ్యర్థి మలసాల భరత్ కుమార్ గురువారం విస్తృతంగా పర్యటిం చారు. అనకాపల్లి ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడుకు భరత్ కుమార్ పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి స్వాగతం పలికారు. నర్సింగరావుపేట ప్రాంతంలో గడప గడపకు కలియ తిరిగారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్‌లకు ఎన్నికల ప్రచారంలో ఈ ప్రాంత ప్రజలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ వైసీపీ సంక్షేమ పథకాలే తమ విజయానికి బాటలుగా పని చేస్తాయని అన్నారు. ఎక్కడ చూసినా ఫ్యాను గాలి వీస్తుందన్నారు. అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం అన్నారు. జగనన్న పాలనలో చాలా కుటుంబాలకు మంచి జరిగిందని మరోసారి జగనన్నను ముఖ్య మంత్రిగా చూసేందుకు అనకాపల్లి ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను అఖండ మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత ప్రజలదేనన్నారు. గడప గడపకు ప్రచారంలో భాగంగా నాయకులు చిరు వ్యాపార స్తులను కలిసి తమ సాధక బాధకాలను తెలుసుకున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి నాయకుల ప్రచారాన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేవ్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పలకా రవి, అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకి రామ రాజు, జాజుల రమేష్, దొడ్డి శ్రీను, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పలకా యశోద, వైసీపీ పట్టణ కార్యదర్శి గ్రైపూడి రాజు పాల్గొన్నారు.

గొల్ల బాబురావు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - నక్కపల్లి: రాజ్యసభ సభ్యులుగా ప్రస్తుత పాయక రావుపేట శాసనసభ్యులు, గొల్ల బాబురావు ఢిల్లీలో రాజ్యసభ సభ్యులుగా పదవి ప్రమాణ స్వీకారం భారత ఉపరాష్ట్రపతి జగదీప్ దినకర్ పార్లమెంట్ హాల్లో చేయించారు. అనంతరం ఉపరాష్ట్రపతి జగదీప్ దినకర్ మర్యాదపూర్వకంగా కలసి వందనాలు తెలియజేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం తోటి రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, రవీందర్ రెడ్డితో పాటు హాల్ ప్రాంగణంలో బాబురావు గ్రూప్ ఫోటోలో పాల్గొన్నారు. బాబురావు వరస క్రమంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీతో కలిసి ముగ్గురు వైసీపీ సభ్యులు, ఉప రాష్ట్రపతి వరుస క్రమంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ఇంత గౌరవప్రదమైన స్థానంలో తనను ఉంచినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఏ నమ్మకంతోనైతే ఇటువంటి గొప్ప అవకాశం కల్పించారో ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పని చేస్తానని బాబురావు ఫోన్ ద్వారా తెలియజేశారు.

స్థల వివాదంలో వ్యక్తిపై దాడి



విశాలాంధ్ర - అచ్యుతాపురం/అనకాపల్లి: జిల్లాలోని ఎలమంచిలి నియోజక వర్గ అచ్యుతాపురం మండలంలో జరిగిన స్థల వివాదంలో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి బాధితుడు కాండ్రేగుల ధర్మరాజు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మోసయ్యపేట గ్రామంలో సర్వే నెంబర్ 84/6 తమకు 6.2 సెంట్లు స్థలం ఉండగా అందులో మూడు సెంట్లు స్థలంలో పది సంవత్సరాల క్రితం ఇల్లు నిర్మించుకొని మా అమ్మ మహాలక్ష్మితో కలిసి నివసిస్తున్నట్లు తెలిపారు. మా ఇంటికి దక్షిణం వైపున మల్ల నవీన్ కిరణ్ వాసు కమర్షియల్ భవంతి నిర్మించడం మొదలుపెట్టారు. అయితే కొద్ది నెలలుగా వారికి మాకు స్థల వివాదంలో గొడవలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం ఇదే విష యమై అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్పందించకపోవడంతో జిల్లా ఎస్పీకి సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా గురువారం వారు కాంక్రీట్ నిర్మాణ పనులు మొదలు పెడుతూ కాంక్రీట్ కలిపే మిక్సర్ హెడ్‌ను మా స్థలం పెట్టగా వారి స్థలంలో పెట్టుకోమని వెళ్లి అడిగానని తెలిపారు. దీంతో అక్కడే ఉన్న మహిళా కూలీలు (కిరాయి మనుషులు) తనపై దాడి చేసి తన తలపై బలంగా రాయితో కొట్టినట్లు తెలిపారు. ఇంతలో ఇంట్లోంచి బయటకు వచ్చిన మా అమ్మ గమనించి వారిని వారించగా తనను కూడా ఈడ్చేసి దాడి చేశారని వాపోయారు. తీవ్ర గాయాలతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేరి అత్యవసర విభాగంలో చికిత్సను వైద్యులు అందిస్తున్నట్లు తెలిపారు. అచ్యుతాపురం పోలీసులు కూడా ఆసుపత్రికి వచ్చి వివరాలు నమోదు చేసుకున్నట్లు ధర్మరాజు తెలిపారు. తన స్థలమును దౌర్జన్యంగా ఆక్రమించి, అడిగిన నన్ను మా అమ్మను, కుటుంబ సభ్యులను కిరాయి మనుషులతో చంపించే ప్రయత్నం చేసిన మల్ల నవీన్ కిరణ్ వాసు, సూరిసెట్టి రాజు, సూరిశెట్టి వంశీకృష్ణ, సూరిశెట్టి నాగేంద్రలపై చర్యలు తీసుకోవాలని ధర్మరాజు డిమాండ్ చేశారు.

గొన్న కళాశాలలో ప్రాంగణ నియామకాలు

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 85వ వార్డు గొన్నవానిపాలెం గొన్నా కళాశాలలో గురువారం ప్రాంగణ నియామకాలు జరిగాయి. చందు స్టాఫ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన నియామకాల్లో 65 మంది బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఐదుగురుని సంస్థ ప్రతినిధులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ గొన్న హేమచంద్ నాయుడు మాట్లాడుతూ కళాశాలలో జరిగే ప్రతి ప్రాంగణ నియామకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియామకమైన విద్యార్థులను ఆయన అభినందించారు. కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నదే తమ ఆశయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టి.డి.పి. మహా కుటమిలో చేరికలు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం పట్టణంలోని ద్వారకానగర్‌కు చెందిన సుమారు 30 కుటుంబాలు వారు మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ఆధ్వర్యంలో గురువారం టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. అధికార ప్రభుత్వం, స్థానిక తాజా మాజీ ఎమ్మెల్యే ధర్మ శ్రీ పేద, బడుగు వర్గాలపై అనుసరిస్తున్న అనుచిత విధానాలతో వై.సి.పి.కు దూరమవుతున్నామని తెలిపారు. టి.డి.పి. హయాంలో రాజు పాలన పట్ల ఆకర్షితులమై స్వయంగా పార్టీలో చేరినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు, టి. శ్రీను,గూనూరు సురేష్, నేమాల హరి బాలిబోయిన దేముళ్లు, ద్వారపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం పట్టణంలో గురువారం పోలీసులు జరిపిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న 25 మద్యం సీసాలు పట్టుకున్నారు. చోడవరం - మాడుగుల బి.ఎన్.రోడ్డులో రత్నం రెస్టారెంట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏ.పి. 31 ఈహెచ్ 1678 హెూండా యాక్టివా స్కూటీలో 09 క్వార్టర్ బాటిల్స్ కలిగి వున్న కల్లేపల్లి శ్రీనివాసరావు పట్టుకున్నారు. అలాగే గజపతినగరం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయనగరం, తుమ్మిడి గ్రామానికి చెందిన ఏగిరెడ్డి నారాయణరావు వద్ద నుండి 16 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్ ఇన్స్పెక్టర్ డి.శేఖరం, సిబ్బంది ఆధ్వర్యంలో జరిపిన దాడుల్లో నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైసీపీకి పట్టం కట్టండి: ఈర్లె అనురాధ

విశాలాంధ్ర - వి.మాడుగుల: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి వైసీపీ మళ్లీ పట్టం కట్టాలని మాడుగుల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. గురువారం ఉదయం శంకరం, కుర్మనాధపురం, సత్యవరం, డి.గొటివాడ సాగరం పంచాయతీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 ఏళ్లు పాలించిన టిడిపి హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందర్నీ మోసం చేశారని, ఇప్పుడు మీ ఇళ్లకు వస్తున్న టిడిపి నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మోసపూరిత పార్టీలను నమ్మకుండా మేలు చేసే వైసిపిని గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళపురెడ్డి వెంకట రాజారామ్, వైసిపి మండల అధ్యక్షులు పెదబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, మాడుగుల టౌన్ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సరిపల్లికి మకాం మార్చిన ఇండిపెండెంట్ అభ్యర్థి గుంటూరు

విశాలాంధ్ర-పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఏపీ గెడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ గుంటూరు వెంకట నరసింహారావు మండలంలోని సరిపల్లి గ్రామానికి తన మకాం మార్చారు. గత కొన్నాళ్లుగా విశాఖలో నివాసముంటున్న ఆయన, ఎన్నికలు చురుగ్గా పాల్గొనే సంకల్పంతో కుటుంబ సభ్యులతో కలిసి సొంతూరు సరిపల్లికి వచ్చేసారు. గురువారం ఉదయం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల సామగ్రిని తీసుకొని సరిపల్లి చేరుకున్నారు. ఇకపై సరిపల్లి గ్రామంలోనే అభిమానులు నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, అందర్నీ సమన్వయం చేసుకొని ఎన్నికల ప్రచారం సాగిస్తానని నరసింహారావు తెలియజేశారు.



కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూం

తొమ్మిది విభాగాలతో నిరంతరం పనిచేస్తుంది

సామాజిక మాధ్యమాలు, వీడియోల ద్వారా ప్రచారాలపై నిఘా

– కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి జిల్లాలో ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అందరికీ తెలియజేయడం, ఎన్నికలలో నిబంధనలను అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం కొరకు ఈ కమాండ్ కంట్రోల్ రూమ్ పని చేస్తుందని చెప్పారు. దీనిలో ముఖ్యంగా తొమ్మిది విభాగాలుంటాయని మీడియా మోనటరింగ్, సోషల్ మీడియా మోనటరింగ్, కంప్లైంట్స్ మోనటిరింగ్, కాల్ సెంటర్, కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్, ఎక్స్ పెన్డీచర్ మొనటరింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వాహనాల పర్యవేక్షణ (జిపియస్ ట్రాకింగ్), వెబ్ క్యాస్టింగ్ విభాగాలుంటాయని చెప్పారు. జిల్లాలో జరిగే ఎన్నికల ప్రక్రియ మొత్తం ఇక్కడి నుండే గమనించవచ్చన్నారు. ఈ విభాగాలన్నింటికీ జిల్లా అధికారులు నేతృత్వం వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ శాఖలలో వున్న నిపుణులైన సిబ్బందిని ఎంపికచేసి నియమించడం జరిగిందన్నారు.

కమాండ్ కంట్రోల్ కేంద్రం ఇన్ ఛార్జి వి.ప్రసాద్ కంట్రోల్ సెంటర్ గూర్చి వివరిస్తూ మీడియా మోనటరింగ్ సింటర్ లో పత్రికలు, టీవీ ఛానళ్లలో వచ్చే వార్తలు, స్క్రోలింగులు, ఇతర సమాచారం ఈవిభాగంలో రికార్డు చేయడం జరుగుతుందన్నారు. గుర్తించిన అంశాలను సంబంధిత పార్టీలు, అభ్యర్థుల పరంగా పొందుపరుస్తారని చెప్పారు. అలాగే సోషల్ మీడియా విభాగంలో యూట్యూబ్, వాట్సాప్, ట్విట్టర్, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ మొదలైన వాటిలో వచ్చిన సమాచారాన్ని సేకరిస్తారన్నారు. ఫిర్యాదుల విభాగంలో సి.విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఎన్నికల కమిషన్ సైట్ లలో వచ్చిన లేదా నమోదైన ఫిర్యాదులను, వివిధ పత్రికలలో వచ్చిన ప్రతికూల వార్తలను గమనించి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు పంపిస్తారన్నారు. గ్రీవెన్స్ కాల్ సెంటర్ లో టోల్ ఫ్రీ నం . 1950, ల్యాండ్ లైన్ నం.08924 226599 నంబరుకు వచ్చిన ఫిర్యాదులను జరుగుతుందన్నారు. కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్ లో పోలింగ్ ప్రక్రియను పరిశీలించి తగిన సమాచారాన్ని సేకరించి పంపిస్తా రన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ విభాగంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తీసిన వీడియోలను వీడియో వీవింగ్ టీమ్ పరిశీలించి ఎన్నికలలో పార్టీలు అభ్యర్థులు ఎన్నికల కోడ్ ను పాటిస్తున్నదీ లేనిదీ గమనించి తగిన చర్యలు చేపడతారని చెప్పారు. జి.పి.ఎస్. ట్రేసింగ్ ద్వారా వాహనాల గమనాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. వాహనాల పర్యవేక్షణ విభాగంలో అవసరాల మేరకు వివిధ వాహనాలను అందించడం వెబ్ కాస్టింగ్ ద్వారా వివిధ చెక్ పోస్ట్ ల వద్ద స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్ లు చేస్తున్న తనిఖీలను పరిశీలించడం జరుగుతుందని వివరించారు.

తెలుగుదేశం పార్టీలో చేరిన గూటూరు శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పాయకరావుపేట: ఇటీవల వైసీపీ నుండి సస్పెండ్ అయిన మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనిత పార్టీ కండువాలు వేసి గూటూరు శ్రీనివాసరావును పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా గూటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయడంలో భాగస్వామిని అయ్యానన్నారు. కష్టకాలంలో ఉన్న ప్రజలందరిని ఆదుకున్నానని తెలిపారు. వ్యక్తి గత స్వార్థాలకు పార్టీ నుండి సస్పెండ్ చేశారన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని టిడిపిలో చేరానన్నారు. పవన్‌కళ్యాణ్ స్వప్రయోజనాలు వీడి ప్రజల ముందుకు వచ్చారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, ఎంపి అభ్యర్థి సీఎం రమేష్ గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు. తన ప్రసంగంలో గూటూరు శ్రీనివాసరావు భావోద్వేగానికి గురయ్యారు. గూటూరు శ్రీనివాసరావుతో పాటు ఈదటం, పాల్మాన్‌పేట ఎంపిటిసిలు గణసాల పద్మ, మోసా మహంకాళమ్మ, మత్స్యకార నాయకులు మైలపల్లి అశోక్ చక్రవర్తి, మాజీ సర్పంచ్ వల్లెల సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి రమణ, పలువురు వార్డు సభ్యులు, కార్యకర్తలు గూటూరు శ్రీనివాసరావుతోపాటు టిడిపిలో చేరారు. అలాగే యలమంచిలి నియోజకవర్గంకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సమక్షంలో టిడిపిలో చేరారు.

రాష్ట్రాభివృద్ధికి ఎన్డీఏ కూటమిని గెలిపించాలి

మాడుగుల నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి పైలా ప్రసాదరావు

విశాలాంధ్ర-మాడుగుల : ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమిని గెలిపించాలని మాడుగుల నియోజకవర్గ మహాకూటమి అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. గురువారం మాడుగుల నియోజకవర్గ ప్రధాన కార్యాలయంలో కూటమి సభ్యులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. ఈ సమావేశంలో అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరులు సీఎం సురేష్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి చీలిక కోసమని వైసీపీ చేస్తున్న అసత్యప్రచారాన్ని ప్రజలు ఎన్నటికీ నమ్మబోరన్నారు. ఐక్యతకు నాందిగా కూటమి రాష్ట్ర ప్రయోజనాల దిశగా ముందుకు వెళ్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం అంటే కూటమి అనేలా రానున్న ఎన్నికల్లో ప్రజలే తమను గెలిపిస్తారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీ కొడుతున్నారని, చంద్రన్న ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా అనకాపల్లి పార్లమెంటరీ, మాడుగుల నియోజకవర్గాల గెలుపుకు కూటమి శ్రేణులు చేస్తున్న కృషి అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు పుట్టా గంగయ్య, మాడుగుల నియోజకవర్గం బీజేపీ పార్టీ ఇంచార్జి మేరపురెడ్డి శ్రీనివాసరావు, మాడుగుల మండలం బీజేపీ పార్టీ అధ్యక్షులు ఉందూరు రాజు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇంచార్జి రాయపురెడ్డి కృష్ణ, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి రొబ్బ మహేష్, వరాహమూర్తి, గెట్టా రామారావు, మాడుగుల మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అద్దిపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉందూరు దేముడు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, క్లస్టర్ ఇంచార్జి పుప్పాల రమేష్, కాళ్ల నర్సింగ రాజు, మాడుగుల టౌన్ పార్టీ ప్రెసిడెంట్ రంజిత్ వర్మ, బుద్ధా రమణ, లెక్కల కాసుబాబు,పెరిచర్ల సూర్యనారాయణ రాజు, వడ్డి రాజకుమార్, చింతలపాటి కల్యాణ చక్రవర్తి, అప్పాన వెంకటరమణ, అప్పాన భాస్కరరావు, మరువాడ ఈశ్వరరావు, దాడి రామ లక్ష్మణరావు, ఎల్లపు రాము, తలారి వంశీ, మండలంలో ముఖ్య జనసేన, బీజేపీ, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు

గెస్ట్‌హౌస్ లు లీజుకు ఇచ్చే ప్రతిపాదన విరమించుకోవాలి

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో నడుస్తున్న గంగవరం గెస్ట్ హౌస్ మరియు ఉక్కునగరంలో ఉన్న ఉక్కు హౌస్ లను లీజ్ పేరుతో 30 సంవత్సరాల పాటు ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇచ్చేందుకు యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలను స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఈ ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించు కావాలని డిమాండ్ చేస్తున్నది. స్టీల్ సిఐటియు అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఒక ప్రకటనలో గెస్ట్ హౌస్ ప్రైవేటు వ్యక్తులకు లీజు ఇవ్వడం వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతుందని, ఉక్కునగరం లో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని, ఇప్పుటి వరకు ప్రశాంతంగా ఉన్న ఉక్కునగర వాసులు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులు శుభకార్యాలకు వినియోగించు కునేందుకు వీలుగా ఈ గెస్ట్‌హౌస్ ను వినియోగించుకోవడం జరుగుతోంది. బయట వారికి ఇచ్చినట్లయితే ఎవరైనా సరే వచ్చి ఉండే విధంగా అత్యధిక ఛార్జీలు వసూలు చేయడం జరుగుతుంది. కాబట్టి ఉద్యోగులకు వారి అవసరాలకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ అవకాశం లీజు కు ఇచ్చినట్లయితే భవిష్యత్తులో అందుబాటులో ఉండే అవకాశం లేదు. దీంతో ఉద్యోగుల తీవ్ర ఇబ్బంది ఎదుర్కోవాల్సి ఉంటుంది. సుదూర ప్రాంతంలో ఉన్నటువంటి గెస్ట్ హౌస్ లపై ఆధారపడవలసి వస్తుంది. దీనివలన ఉద్యోగులు ఆర్థికంగానూ, మానసికంగానూ నష్టపోతారు. అదేవిధంగా ఇప్పటివరకు ఉక్కునగరం లో బయట వ్యక్తులు రాకపోవడం వలన ప్రశాంత వాతావరణ ఉంది. ప్రస్తుతం ఉక్కు హౌస్ లో మధ్య నియంత్రణ వుంది. అయనప్పటికి గతంలో ఉక్కునగరం క్లబ్ లో మద్యం, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ప్రవేటు వా7రికి ఇచ్చినట్లతే విచ్చల విడిగా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గంగవరం గెస్ట్ హౌస్ దేశభద్రత దృశ్య చాలా కీలకమైంది, దీనిని ప్రైయివేటు వారికి ఇవ్వడం అత్యంత ప్రమాదకరం కాబట్టి యాజమాన్యం గంగవరం గెస్ట్ హౌస్ మరియు ఉక్కు హౌజ్ ను 30 సంవత్సరాల పాటు ప్రైవేటు వ్యక్తులకు లేజ్ కు ఇవ్వాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై టీ దాస్ , యు రామస్వామి డిమాండ్ చేశారు.

పెందుర్తి కాంగ్రెస్ నాయకులకు షర్మిలా రెడ్డి హామీ

విశాలాంధ్ర-పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్ మార్పు కోసం పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఆ పార్టీ నాయకులు తెలియజేశారు. పెందుర్తి కాంగ్రెస్ టికెట్ ను పిరిడి భగత్ కు కేటాయించడంతో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆదారి రమేష్ నాయుడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా, డీసీసీ ఉపాధ్యక్షుడు విన్నకోట రాము, డీసీసీ ప్రధాన కార్యదర్శి కొమ్మోజు లక్ష్మోజీ, ఓబీసీ జనరల్ సెక్రటరీ ఆర్ ఆర్ నాయుడు, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి గండి సన్నిబాబు, సబ్బవరం మండల పార్టీ అధ్యక్షుడు బయలుపూడి రాంబాబు, స్టీల్ ప్లాంట్ పోరాట కమిటీ సభ్యుడు కడియం శివాజీ తదితరులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. వారంతా కలిసి విజయవాడ వెళ్లి పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని కలిసి స్థానిక పరిస్థితులను వివరించారు. జిల్లాకు, నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తికి టిక్కెట్టు ఇస్తే పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని ఆమెకు విన్నవించారు. అలాగే ఎంపీగా జిల్లా పరిషత్ చైర్మన్‌గా సేవలందించిన ఎస్ఆర్ఏఎస్ అప్పలనాయుడు వారసుడు, నియోజకవర్గం ప్రజలతో సత్సంబంధాలు గల ఆదారి రమేష్ నాయుడుకు టిక్కెట్టు ఇస్తే విజయం సాధిస్తామని తెలియజేశారు. దీనిపై స్పందించిన షర్మిల రెడ్డి సమాచార లోపం కారణంగా పొరపాటు జరిగిందని దీన్ని చక్కదిద్దడానికి ప్రయత్నిస్తామని వారికి హామీ ఇచ్చారు. స్థానిక పరిస్థితులను ఏఐసీసీకి వివరించి పెందుర్తి టికెట్ మార్పు చేస్తామని షర్మిల రెడ్డి హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు మీడియాకు తెలియజేశారు.

ఆడారికి జన నీరాజనాలు

విశాలాంధ్ర - మద్రిపాలెం: పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ జన నీరాజనాలు అందుకుంటున్నారు. అడుగడుగునా మహిళలు హారతి ఇస్తూ, ఘన స్వాగతం పలుకుతున్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండడంతో పశ్చిమ నియోజక వర్గంలో వైసీపీ జెండా ఎగరనుందని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం 92వ వార్డులో జీవీఎంసీ కో ఆప్షన్స్ సభ్యులు బెహర భాస్కరరావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గోపాలపట్నం లక్ష్మీ నగర్ ప్రాంతంలో ప్రారంభమైన ప్రచారంలో ఆడారికి వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు సాలువలతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇస్తూ, వైసీపీ కి పట్టం కట్టాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలందరికి అందుబాటులో ఉంటూ, సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే, వైఎస్ జగన్మోహన్ రెడ్డిముఖ్యమంత్రి అవ్వాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, ఓటు ను అభ్యర్థించారు. ప్రతిపక్ష పార్టీల కుట్రలకు బలికాకుండా, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రతీ అడుగు ప్రజా శ్రేయస్సు కోసమే...

విశాలాంధ్ర - పద్మనాభం: భీమిలి వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీని వాసరావు ఆధ్వర్యంలో పొట్నూరు గ్రామంలో 18వ రోజు ఎన్నికల ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహించడం . ప్రజలను ఉద్దేశించి అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పాలనకు వైసిపి ప్రభుత్వం లో జగనన్న అందించిన పాలనకు మధ్య వ్యత్యాసం ప్రజలైన మీకే బాగా తెలుసునని,గత ప్రభుత్వాలు పాలన మాదిరిగా వైసిపి పాలనలో లంచాలు లేవు,దళారి వ్యవస్థ లేదన్నారు. ప్రభుత్వ అధికారులు కార్యాలయాలు చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగే పరిస్దితి లేదు,నాయకులు పథకాలు అమలు కానీయకుండా అడ్డుకునే పరిస్థితి లేదన్నారు. తొలి కోడి కూయక మునుపే మీ గడప దగ్గర కు వాలంటీర్లు వచ్చి తలుపు తట్టి చిరునవ్వుతో ఠంచన్ గా పెన్షన్లు తో పాటు మీ పథకాలు అందించడం జరుగుతుంది.రాష్ట్రంలో ముఖ్య మంత్రిగా మళ్ళీ జగనన్న వస్తేనే మీకు అందించిన సంక్షేమ పథకాలు అమలు పాలన తో పాటు మరింత సుపరిపాలన అందించడం జరుగుతుంది.లేదంటే గతంలో మాదిరిగా కాళ్ళు అరిగేలా తిరిగే పరిస్దితి లంచాలు ఇవ్వడం ఇలా ప్రతీది నరకం చూడటమే కనుక మీకు అన్నం పెట్టె వారు కావాలో సున్నం పెట్టే వారు కావాలో మీకు మీరుగా ఆలోచించుకొని భీమిలీ లో ఫ్యాన్ గుర్తు పై ఓటేసి నన్ను మూడోసారి ముచ్చటగా యంయల్ఏ గా - విశాఖ జిల్లా యంపి అభ్యర్థి బొత్సా ఝాన్సీ ని అఖండ మెజారిటీతో గెలుపించాలని గెలిపించాలని అభ్యర్థిస్తూ మాట్లాడారు.

బిజెపిలోకి పరుచూరి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: సీనియర్ నాయకులు, అనకాపల్లి జనసేన పార్టీ మాజీ సమన్వయకర్త పరుచూరి భాస్కరరావు గురువారం ఎన్డీయే కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సి.యం.రమేష్ సమక్షంలో బీజేపీలో చేరారు.పరుచూరి ఆధ్వర్యంలో పెద్దయెత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలను సి.యం.రమేష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేనను నమ్ముకుని పదేళ్లుగా సేవ చేస్తున్న, రాష్ట్రంలో ఎక్కడ అనే విధంగా అనకాపల్లి నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసిన మాటవరసకైనా తనకు చెప్పకుండా వేరే వారికి సీటు ఇవ్వడంపై ఆయన జనసేన కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటన చేసిన పరుచూరి కొద్ది రోజుల్లోనే బీజేపీలు చేరడం విశేషం. బిజెపి కి చేరిన అనంతరం ఆయన మాట్లాడుతూ. 30 ఏళ్లగా రాజకీయాలు చేస్తున్నానని అయినప్పటికీ తనకు సరైన గుర్తింపు రాలేదని అన్నారు. ఈ ఎన్నికల్లో సీఎం రమేష్ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఇదిలా ఉండగా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు ఎన్డీయే కూటమి అభ్యర్థి సి.యం.రమేష్ ని కలసి వారి మద్దతు తెలిపారు.కమలం గుర్తును ప్రతి గడపకూ చేర్చే బాధ్యత తీసుకుంటామని, కూటమి అఖండ విజయానికి కృషి చేస్తామని వారంతా తెలిపారు. అందుకు వారికి సి.యం.రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

మీ ఓట్ల రాజకీయాలకు పింఛను దారులను బలిచేయడం సరికాదు : లోక్‌సత్తా!

విశాలాంధ్ర-బొబ్బిలి : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఆడుతున్న ఓట్ల రాజకీయాలలో పింఛను దారులు బలి అయ్యారని, వారు ఆడుతున్న స్వార్థ రాజకీయ క్రీడలో వృద్ధులు, వికలాంగులు, కిడ్నీ బాధితులు, పక్షవాత రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అయినా సమస్య పరిష్కారం కోసం కాకుండా మీది తప్పు అంటే మీది తప్పు అని రాజకీయా పార్టీలు మాటలు విసురుకోవడం చూస్తుంటే వారికి ఓట్లు దండుకోవడం తప్పా ప్రజా సమస్యల పరిష్కారం కాదు అని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు అన్నారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ పింఛను సమస్యను ఒకసారి గమనిస్తే, రాష్ట్రంలో గత నెల 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యింది. అంటే అక్కడ నుండి ప్రభుత్వం అంటే అధికారులే తప్పా మరి మనం ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉండదు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయించవద్దు అన్నప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చెయ్యవలసింది అధికారులే తప్పా ప్రజా ప్రతినిధులకు సంబంధం లేదు. మార్చి నెల బడ్జెట్ ముగింపు కాబట్టి 31మరియు ఏప్రిల్ 1 న బ్యాంకు నుండి డబ్బు దొరకదు. ఇక 2 వ తారీఖు నుండి బ్యాంకుల్లో డబ్బు జమ అయిన దాదాపుగా 3 వ తారీఖున నాటికి పూర్తి స్థాయిలో డబ్బు లభించి నిన్నటికి సచివాలయాలకు పూర్తి స్థాయిలో డబ్బు చేరి నిన్నటి నుండీ పింఛన్ల పంపిణీ ప్రారంభం అయ్యింది. దీనిని మనం గమనిస్తే ఇది ఎలాంటి రాజకీయ సమస్య కాదు. అయినా దీనిని మన రాజకీయ పార్టీలు, నాయకులు దొరికిందే తడవు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఈ సమస్యకు మసాలా దట్టించి మాట్లాడి ఓట్ల రాజకీయం చేసారే తప్పా మధ్యన పింఛను దారులు బలి అవుతున్నారన్న కనీస జ్ఞానం లేకపోవడం బాధాకరంగా ఉందని ఆయన అన్నారు..

ఇక రెండవ అంశం ఒక సచివాలయ పరిధిలో సుమారుగా మూడు వేల జనాభా అందులో ఈ పింఛన్ అందుకున్న వారు ఓ పది శాతం వేసుకుంటే మూడు వందల మంది. సచివాలయ సిబ్బంది పది మందిని వేసుకున్న మనిషికి ముప్పై మంది. రోజుకి వీరు పది మందికి పంచినా మూడు రోజులలో పూర్తయిపోతుంది. ఈ సచివాలయ సిబ్బంది అందరూ ఏదో పని మీద క్షేత్ర స్థాయిలో ఆ సచివాలయ పరిధి అంతా తిరిగిన వారే. ఈ పింఛన్ల పంపిణీ కోసం ఇద్దరు అధికారులకు బాధ్యతలు అప్పజెప్పి సచివాలయం దగ్గర టెంటులు, కుర్చీలు, మంచి నీరు తదితర ఏర్పాట్లు చేసి పింఛను దారుల కోసం ఎదురు చూడడం, ఇంత ఖర్చు అవసరమా? దీనిని అవకాశంగా తీసుకుని కొన్ని రాజకీయ పార్టీలు వృద్ధులకు సేవ అని పింఛను దారులను సచివాలయాలకు తీసుకుని వెళ్లండి అని పిలుపునిచ్చాయి. మరి వాలంటీర్లు చేసే పనే సేవ అని వీరు చేసినట్టే. మరి వీరు ప్రజలను ప్రలోభ పెట్టినట్టు కాదా? దీని వలన రాజకీయ గొడవలు జరిగి కొత్త సమస్య వచ్చినట్టే. దయచేసి అలాంటి వారిని సచివాలయాలకి అనుమతించపోవడమే మంచిది. ఏ రాజకీయ పార్టీ గానీ నాయకుడు గానీ ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా వారికి అందాల్సిన సంక్షేమ పథకాలు అందేట్టుగా చూడాలే తప్పా అన్నింటినీ ఓట్ల కోసం మన రాజకీయ స్వలాభం కోసం వాడుకోవడం మంచిది కాదు. అందునా పేదవారిని, వృద్ధులను ఇబ్బంది పెట్టడం సరికాదు. ప్రజలు వాస్తవాలు తెలుసుకుని విజ్ఞతతో ఆలోచించండి అని దామోదర రావు అన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-జామి: మండలంలోని మొకాసా కొత్తవలస పంచాయతీ పరిదిలోని బలరాం పురం కాలనీలో మంగళవారం ఉదయం అనారోగ్యంతో బాధపడుతున్న ఓవ్యక్తి తన వ్యాధి తీవ్రతను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు బలరాంపురం కాలనీలో నివాసముంటున్న ఒడిసల అప్పారావు(57) గతకొంతకాలంగా ఆస్మా, కడుపునెప్పి తదితర వ్యాధులతో బాధపడుతున్నారు. ఇంట్లో భార్య తాను మాత్రమే ఉన్న నేపథ్యంలో మంగళవారం ఉదయం భార్య సన్యాసమ్మ లేని సమయంలో ఇంట్లో ఉన్న బ్లీచింగ్ పైడర్‌ను నీటిలో కలుపుకుని తాగేశాడు. ఇంతలో ఇంటికి వచ్చిన భార్య గుర్తించి వెంటనే స్థానికుల సహకారంతో విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున అప్పారావు మృతి చెందాడు. ఆయన కుమారుడు దేముడు ఫిర్యాదు మేరకు జామి ఎస్ఐ వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.